
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
గురువారం 6 ఫిబ్రవరి 2025



మినీజాతరకు అంకురార్పణ

- మేడారంలో ఘనంగా గుడిశుద్ధి పండుగ
- తల్లుల దర్శనానికి 40 వేల మందికి పైగా భక్తుల రాక
- సందడిగా మారిన సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణం



మేడారంలో గుడిశుద్ధి పండుగలో పూజారులు

7



గద్దెల విస్తరణ లేనట్టేనా?

7

- 32 గుంటల స్థలంలోనే మేడారం గద్దెల సాలారం
- తల్లులను దర్శించుకునేందుకు ప్రతీ జాతరలో భక్తులకు ఇబ్బందులు
- 4 ఎకరాల్లో విస్తరించాలన్న ప్రతిపాదన అటకెక్కిన వైనం
- 19ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించటంలో రెవెన్యూ జాప్యం
- ప్రపంచం అబ్బుర పడేలా జాతర నిర్వహిస్తామని దాటవేసిన గత ప్రభుత్వం
- ప్రశాంత దర్శనం కోసం కాంగ్రెస్ సర్కారైనా దృష్టి పెట్టాలని భక్తుల విజ్ఞప్తి

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర.. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందింది. ప్రతీ రెండేళ్లకోసారి ఫిబ్రవరిలో జరిగే ఈ వనదేవతల మహా సంరంభానికి కోటిన్నరకు పైగా భక్తులు తరలొస్తారు. అంతేకాదు కొన్నేళ్లుగా మామూలు రోజుల్లోనూ దర్శనానికి వచ్చే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా మహాజాతర జరిగే ఆ నాలుగు రోజుల్లో సుదూర ప్రాంతాల నుంచి తరలొచ్చే కోట్లాది భక్తులు తల్లులను తనివితీరా దర్శించుకోలేని పరిస్థితి ఉంది. అందుకు కేవలం 32 గుంటల స్థలంలో నిర్మించిన సమ్మక్క-సారలమ్మల గద్దెల ప్రాంగణం (సాలారం) ఇరుకుగా ఉండడమే కారణం. ఈ క్రమంలో ఈ ప్రాంగాణానికి పక్కనే ఉన్న దేవాదాయ శాఖకు చెందిన నాలుగెకరాల్లో విస్తరించాలనే ప్రతిపాదన 2012 నుంచే ఉన్నా.. అది కార్యరూపం దాల్చలేదు. ఇక పక్కనే ఉన్న 19ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించడంపై రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టకపోవడం కూడా ఓ కారణమేనన్న అభిప్రాయాలున్నాయి. కనీసం వచ్చే ఏడాది జరగబోయే మహాజాతర నాటికైనా ఇది కార్యరూపం దాల్చాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



ఆయుష్మాన్ యోగా

- ఆసనాలతో సంపూర్ణ ఆరోగ్యం
- జిల్లాలో పది కేంద్రాల ఏర్పాటు
- సద్వినియోగం చేసుకుంటున్న యువత, వృద్ధులు

తొర్రూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత జీవన విధానంలో అనేక మార్పులు రావడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఆహారపు అలవాట్లు, తినే తిండిలో విపరీతంగా కల్తీ ఉండడంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. సాంకేతిక రంగాల్లో అనేక మార్పులు రావడంతో సరైన తిండి, నిద్ర లేక కంప్యూటర్‌ల ముందు గంటల తరబడి కూర్చోవడం ప్రతి ఒక్కరి జీవన శైలిగా మారిపోయింది. దీంతో మనిషి రోగాల కుప్పగా మారుతున్నాడు. వీటన్నిటికి ప్రధాన కారణం మనిషికి సరైన వ్యాయామం లేకపోవడమే అని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వమే గ్రామాల్లో ఆయుష్ యోగా కేంద్రాలను ప్రారంభించింది.

యోగాతో ప్రశాంతత, ఆధ్యాత్మికత

నిత్యం యోగాసనాలు, ధ్యానం చేయడంతో శరీరంలో ప్రతికూల ప్రభావం తొలగి ప్రశాంతత, ఆధ్యాత్మికత చేకూరుతుందనేది నిరూపిత సత్యం, నిత్యం యోగాతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఆసనాలు, ప్రాణాయామాలు, ధ్యానం మనిషిని శక్తివంతం చేయడంతో పాటు సన్మార్గంలో నడిపించేందుకు దోహదపడతాయి. ఆరోగ్య జీవనానికి దోహదపడే యోగాను ప్రజలకు నేర్పించేందుకు జిల్లాలో ఆయుష్ ఆరోగ్య మందిరాలు ప్రత్యేకంగా నిర్మించి ఇన్‌స్ట్రక్టర్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఔత్సాహికులు ఉదయం, సాయంత్రం ఉచితంగా శిక్షణ పొందుతూ తేలికపాటి ఆసనాలు నేర్చుకుంటున్నారు.



తొర్రూరులో యోగా చేస్తున్న దృశ్యం

జిల్లాలో 10 కేంద్రాలు

జిల్లాలో ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో, యునాని ఆరోగ్య కేంద్రాల్లో ఆయుష్ ఆరోగ్య కేంద్రాలను కేంద్ర ప్రభుత్వ నిధులతో మందిరాలు ఏర్పాటు చేసి యోగా శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని తొర్రూరు, వడ్డెకొత్తపల్లి, బయ్యారం, ముల్కనూరు, జమాండ్లపల్లి, మన్నెగూడెం, చిన్నముప్పారం, గూడూరు, కురవి, పెద్దముప్పారం గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా గతంలో గ్రామీణ ప్రాంతాల్లో యోగా కేంద్రాలు, శిక్షకులు లేక ఆరోగ్యంపై అవగాహన లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ యోగాలో భాగంగా ఈ పథకం ఏర్పాటు చేయడంతో గ్రామీణ యువత సైతం యోగా కేంద్రాల్లో శిక్షణ తీసుకుంటున్నారు.

ఉదయం, సాయంత్రం గంట పాటు

ప్రజల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకంలో ఏర్పాటు చేసిన యోగా కేంద్రాల్లో యోగా శిక్షణతో పాటు ఆయుర్వేదంలో రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసింది. వైద్యం వరకు వెళ్లకుండా మానసిక, శారీరకంగా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఆరోగ్య మందిరాల్లో యోగాకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో పది కేంద్రాల్లో ఉదయం సాయంత్రం గంట పాటు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఏడాది పాటు బృందాల వారిగా యోగాసనాలు నేర్పించేందుకు కృషి చేస్తున్నారు.



సద్వినియోగం చేసుకోవాలి

- డాక్టర్ పి. కిరణ్ కుమార్, ఆయుర్వేద యునాని ఆరోగ్య కేంద్రాల జిల్లా ఇన్‌చార్జ్

మారుమూల గ్రామాలకు యోగా చేరువచేయాలనే ఆలోచనతో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో పది కేంద్రాల్లో యోగా తరగతులు కొనసాగుతున్నాయి. ఒక్కో కేంద్రాల్లో శిక్షకులను నియమించి ఆసనాలు చేయిస్తున్నాం. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలోని 9 కేంద్రాల్లో సొంత భవనాలు ఉన్నాయి. పెద్ద ముప్పారంలో దాతల సాకారంతో ఏర్పాటుచేసిన హాల్‌లో యోగా తరగతులు కొనసాగుతున్నాయి.



యోగా దివ్య ఔషదం

- సీహెచ్ రాజా, తొర్రూరు

మనసుకు ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధంగా పనిచేస్తుంది. మెదడుకు పదును పెట్టడానికి యోగా ఎంతో ఉపకరిస్తుంది. నేటితరం మొబైల్ ఫోన్‌లు, కంప్యూటర్‌ల ముందు ఎక్కువ సమయం గడుపుతున్నారు. దీంతో అనేక శారీరక, మానసిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఎంత ఒత్తిడి ఉన్నా ఉదయం గంటపాటు యోగా చేస్తే రోజంతా ప్రశాంతంగా గడపవచ్చు.



చింతలగట్టులో మండమెలిగె

భారీగా తరలివచ్చిన భక్తులు

గూడూరు చింతలగట్టు వట్టివాగు సమ్మక్క-సారలమ్మ జాతరలో వనదేవతల గద్దెల ముందు పూజలు నిర్వహిస్తున్న అధికారులు, పూజారులు

8

వైద్య కళాశాల పనులను త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న వైద్యకళాశాల భవన నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో చేపడుతూ జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. పట్టణ శివార్లలో నిర్మితమవుతున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం జాప్యం చేయకుండా నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం కళాశాల నిర్వహిస్తున్న భవనంలో వైద్యవిద్యార్థులకు తాగునీరు, విద్యుత్ సదుపాయ తదితర సౌకర్యాలు కల్పిస్తూ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా భవన నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లాకావత్ వెంకట్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నెల్లికుదురు : వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ ఆదేశించారు. బుధవారం నెల్లికుదురు మండలం కేంద్రంలోని కేజీబీవీ వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని కిచెన్‌షెడ్, డైనింగ్‌హాల్, స్టోర్‌రూం, పరిసరాలను పరిశీలించి కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనం వడ్డించాలని అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. స్వచ్ఛమైన తాగునీరు, అందిస్తూ మరుగుదొడ్లను, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు విద్యార్థుల మానసిక, ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తూ, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట కేజీబీవీ ప్రిన్సిపాల్ ఇల్లందుల సుమలత, సిబ్బంది ఉన్నారు.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

- అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల (నట్టల నివారణ) నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అదనప కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరు నెలలకొకసారి ప్రతీ సంవత్సరం రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందని చెప్పారు. ఒకటి నుంచి రెండేళ్ల వరకు పిల్లలకు చెంచాలో సగం టాబ్లెట్‌ని పొడి చేసి కొద్దిగా నీరు కలిపి ఇవ్వాలని , రెండు నుంచి మూడేళ్ల పిల్లలకు పూర్తిగా అల్బెండజోల్ మాత్రపొడి చేసి కొద్దిగా నీరు కలిపి ఇవ్వాలని తెలిపారు. 3 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండ జోల్ మాత్ర మొత్తం నమిలి మింగేలా చూడాలన్నారు. అన్ని శాఖల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నులిపురుగులు మానవుల ప్రేగుల్లో నుంచి పోషకాహారం గ్రహించి అభివృద్ధి చెందే పరాన్నజీవులని, నులిపురుగుల గురువులు కలిగిన మలముతో నేలను కలుషితం చేస్తాడని ఈ గుడ్లు నేలలో లార్వాలుగా వృద్ధి చెందుతాయని వివరించారు. ఆహారం ద్వారా, లేదా మురికి చేతుల ద్వారా పిల్లల చర్మంలోపలికి ఈ లార్వా చొచ్చుకుపోవడం ద్వారా నులిపురుగులు సంక్రమణ అవుతాయని, నులిపురుగులు సంక్రమించిన పిల్లల్లో గుడ్లు లార్వాలు నులిపురుగులు అభివృద్ధి చెందుతాయన్నారు.

నులిపురుగుల ప్రభావంతో పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం ఉంటుందని ఆల్బెండజోల్ మాత్ర నులిపురుగుల నియంత్రణకు సహాయ పడుతుందన్నారు.

ఫిబ్రవరి 10న మాత్రలు వేసుకుని పిల్లలకు ఈనెల 17న వేసుకోవచ్చన్నారు. జిల్లాలోని విద్యాసంస్థల్లో పక్కాగా మెనూ పాటించాలని పాఠశాలల్లో నిరంతరం తనిఖీలు చేపట్టాలని సూచించారు ఈ వీసీలో జిల్లా అధికారులు పురుషోత్తం, రవీందర్‌రెడ్డి, నర్సింహస్వామి, శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్, శ్రీరాములు, హరి ప్రసాద్, ధనమ్మ, కేవీ. రాజు, వైద్యాధికారులు మురళీధర్, ప్రమీల, లక్ష్మీనారాయణ, జగదీశ్వర్, సుధీర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, రామకృష్ణ, రవి, అప్పారావు పాల్గొన్నారు.



వీసీ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

50 ఆకుల తునికాకు కట్టకు రూ.6 చెల్లించాలి

- సకాలంలో ప్రూనింగ్ పనులు చేపట్టాలి
- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్

మహబూబాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం 2025 సీజన్‌లో తునికాకు సేకరణకు కాంట్రాక్టర్లను ఆహ్వానించి టెండర్లను వేసి వెంటనే ప్రూనింగ్ పనులు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఆయన పేరిట ఆంధ్రజ్యోతి మహబూబాబాద్ జిల్లా కార్యాలయానికి బుధవారం పంపిన ఓ ప్రకటనలో పలు అంశాలను వెల్లడించారు. 50ఆకులతో కూడిన కట్టకు రూ. 6 ప్రభుత్వ ధరగా నిర్ణయించాలని చెప్పారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బోనస్‌ను ఆకు సేకరణకు ముందే ఆదివాసీలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. తునికాకు కూలీలకు రావాల్సిన బోనస్ డబ్బుల చెల్లింపుల్లో అవకతవకలు, అవినీతి, అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చాయని వీటిపై సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తునికాకు రేటును పెంచడం ద్వారా కూలీలు ఆకు టార్గెట్‌ను పూర్తి చేయడంతో పాటు కూలీలకు, ప్రభుత్వానికి, కాంట్రాక్టర్లకు ఆదాయం పెరుగుతుందన్నారు. బహుళ ఆదాయాలకు అవకాశం ఉన్న తునికాకు సేకరణకు త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. తునికాకు సేకరణ సమయంలో సంభవించే ప్రమాదాలకు తగిన నష్ట పరిహారం చెల్లించాలని, అలాగే ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆరు లక్షల మంది ఆదివాసీలు, గిరిజనులు, పేద ప్రజలు తునికాకు సేకరణపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు.

ప్రధానంగా వ్యవసాయం తర్వాత రెండవ ఆదాయం తునికాకు సేకరణేనని పేర్కొన్నారు. స్త్రీ, పురుషులకు సమానపనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. శ్రమకు తగ్గట్లుగా ప్రభుత్వమే రేట్లు పెంచి అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుందని తెలిపారు.



రాణాలో వరుస దొంగతనాలు?

- నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో రికవరీ సొత్తు మాయం
- ఆలస్యంగా వెలుగులోకి

8

పలిమెల తహసీల్దార్‌పై వేటు

- గత నెల 24నే సస్పెన్షన్
- గోప్యంగా ఉంచిన అధికారులు
- దక్కన్ సిమెంట్ భూ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో చర్యలు

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పలిమెల తహసీల్దార్ సర్వర్‌పై వేటు పడింది. ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గత నెల 24 తేదీలోనే ఈ సస్పెన్షన్ ఆర్డర్ రాగా జిల్లా, డివిజన్ అధికారులు గోప్యంగా ఉంచడం చర్చనీయాంశంగా మారింది. నెల రోజుల క్రితం దక్కన్ సిమెంటు కంపెనీకి సుమారు 102ఎకరాల భూమిని ఒకే రోజులో రిజిస్ట్రేషన్ చేయడం కలకలం రేపింది. ఈఘటనపై తాజాగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తమవుతుండగా, ఈ ఉత్తర్వుల వచ్చిన విషయాన్ని అధికారులు దాచి పెట్టడంలో ఆంతర్యమేమిటో అనే చర్చ జోరుగా సాగుతోంది.

తహసీల్దార్ సస్పెన్షన్‌లో రాజకీయం?

దక్కన్ సిమెంటు కంపెనీకి రాత్రి వేలల్లో ప్రైవేటు గదుల్లో రహస్యంగా రిజిస్ట్రేషన్ చేయడంపై రాజకీయం రాజుకుంది. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా విచారణకు ఆయన ఆదేశించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, బీజేపీ నాయకులు సునీల్‌రెడ్డి, వామపక్ష నాయకులు సైతం స్పందించారు. తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం జరిగింది. రెండు పార్టీల నేతలు పరస్పరంగా ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ నేతలు జోక్యం చేసుకుంటూ రెండు పార్టీల నేతలపై ఆరోపణలు చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో విచారణ అనంతరం తహసీల్దార్‌పై వేటు వేసేందుకు అధికార యంత్రాంగం మొగ్గు చూపినప్పటికీ పక్క జిల్లాకు చెందిన ఓ మంత్రి జోక్యం చేసుకోవడంతో ఇంతకాలం సస్పెన్షన్ ఆగిందని తెలిసింది. తాజాగా ఈఘటనపై మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆరా తీయగా సస్పెన్షన్ పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడైంది.

దీంతో మంత్రి శ్రీధర్‌బాబు దీన్ని సీరియస్‌గా తీసుకొని చర్యలకు పూనుకోవాలని ఆదేశించడం వల్లే తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు సమాచారం.


గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

కొండపర్తిలో గవర్నర్ కార్యదర్శుల పర్యటన

దత్తత గ్రామంలో పనుల పరిశీలన

తాడ్వాయి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ దత్తత తీసుకున్న ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో అభివృద్ధి పనులను గవర్నర్ జాయింట్ సెక్రటరీ భవాని శంకర్, ప్రైవేటు సెక్రటరీ పవన్ సింగ్ బుధవారం పరిశీలించారు. కలెక్టర్ దివాకరతో కలిసి పర్యటించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ గిరిజనుల అభివృద్ధి కోసం చేపట్టిన అభివృద్ధి పనులు సోలార్ ఆర్గనైజింగ్ సిస్టం, మసాల మేకింగ్, టైలరింగ్ సెంటర్, స్కూల్, అంగన్‌వాడీ భవనాల కాంపౌండ్ వాల్, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, స్కిల్ డెవలప్మెంట్ తదితర అభివృద్ధి పనుల ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో 79 బీపీఎల్ గృహాలు ఉన్నాయని, 370 మంది జనాభా ఉన్నారని వ్యవసాయం ద్వారా వీరు జీవనోపాధి పొందేందుకు పదెకరాల భూమిలో ఒక బోర్ వేసి మోటార్లు అందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఆర్డీవో వెంకటేశ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, వ్యవసాయ శాఖ అధికారి సురేశ్, ఎంపీడీవో సుమన వాణి, ఇన్‌చార్జి తహసీల్దార్ జగదీశ్‌తో పాటు పలు శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

పొలాల చుట్టూ కరెంటు తీగలు అమర్చవద్దు

ములుగు ఎస్పీ శబరీశ్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల నుంచి రక్షణ కోసమంటూ పంటచేల చుట్టూ కరెంటు తీగలను అమర్చవద్దని ఎస్పీ శబరీశ్ అన్నారు. పంట రక్షణ, అటవీ జంతువుల వేట కోసం విద్యుత్ తీగలను అమర్చవద్దంటూ ములుగు సర్కిల్ పోలీసులు రూపొందించిన పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. అక్రమంగా విద్యుత్ తీగలను అమర్చడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. గరిష్ఠంగా పదేళ్ల జైలుశిక్ష పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బారికేడ్ల తొలగింపు

ములుగు పోలీస్ స్టేషన్ పరిధి జంగాలపల్లి జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ఐరన్ బారికేడ్లను బుధవారం ఎస్సై వెంకటేశ్వరరావు పంచాయతీ సిబ్బంది చేత తొలగింపజేశారు. డ్రంకెన్ డ్రైవ్, అతివేగం, మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.

కుంభాభిషేకానికి కలెక్టర్‌కు ఆహ్వానం

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో ఈనెల 7,8,9 తేదీల్లో నిర్వహించనున్న మహాకుంభాభిషేకానికి హాజరు కావాలని కోరుతూ కలెక్టర్ రాహుల్‌శర్మకు ఆలయ ఈవో మహేష్ ఆహ్వాన పత్రికను అందజేశారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఈవో కలిశారు. మహా కుంభాభిషేకానికి రావాలని సాదరంగా ఆహ్వానించారు.


కలెక్టర్‌కు ఆహ్వానపత్రికను అందిస్తున్న ఆలయ ఈవో

ఎన్‌హెచ్ 930పీ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందే

- సాలార్‌తండా వద్ద హైవేపై రైతుల రాస్తారోకో
- సర్వేకు వచ్చిన అధికారుల అడ్డగింత


మహబూబాబాద్ సాలార్‌తండా వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వలిగొండ నుంచి భద్రాచలం వరకు నిర్మించే జాతీయ రహదారి (930 పీ) అలైన్‌మెంట్‌ను మార్చి తమ ఇళ్లు, భూములు కోల్పోకుండా చూడాలని గిరిజన రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. సాలార్‌తండా వద్ద జాతీయ రహదారి సర్వేకు వచ్చిన ఎన్‌హెచ్ అధికారులను రైతులు అడ్డుకున్నారు. ఎన్‌హెచ్ 365పై బైఠాయించారు. ఓ మహిళా పురుగుల మందు డబ్బాతో ధర్నాలో పాల్గొనడంతో గమనించిన అధికారులు ఆమె చేతిలో నుంచి డబ్బాను తీసి పడవేశారు. ఈ సందర్భంగా సాలార్‌తండా గిరిజన రైతులు భూక్య కల్యాణ్, బాదావత్ సీతారం, బాలాజీ, దారావత్ కిషన్ మాట్లాడుతూ.. వలిగొండ నుంచి భద్రాచలం వైపు వెళ్లే జాతీయ రహదారి (930పీ) తొలుత జిల్లా కేంద్రం బయట నుంచి ఐదు కిలోమీటర్ల దూరం నుంచి నిర్మించేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారన్నారు. ఆ తర్వాత కొంత మంది రాజకీయ పలుకుబడిని ఉపయోగించి జాతీయ రహదారి అలైన్‌మెంట్‌ను మార్చారని చెప్పారు. దీంతో సాలార్‌తండా నుంచి జాతీయ రహదారి పోతుండడంతో తమ ఇళ్లు, భూములు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు తమ గోడును తెలిపామన్నారు. జాతీయ రహదారి అలైన్ మెంట్‌ను మార్చి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరం నుంచి రహదారి నిర్మాణం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, డీఎస్పీ తిరుపతిరావు నేతృత్వంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. రైతులు కొంత సమయం కావాలని కోరడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతులు భూక్య హతిరాం, కంసాలి, బాదావత్ లక్ష్మి, సుహాసిని, సిరి, సుభాషిణి, భద్రు, బిచ్యా, కల్యాణ్, మంగ్యా, కాంతి, రంజిత్, రమేష్, విజయ తదితరులు పాల్గొన్నారు.

దళితుల పట్ల అగ్ర కులస్థుల వివక్ష?

- ఆలయానికి రంగులు వేయొద్దంటూ అల్టిమేటం
- మానుకోట జిల్లా జయపురంలో ఘటన
- దళిత సంఘాల ఆందోళన
- పీఎస్‌లో ఫిర్యాదు

నర్సింహులపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆలయానికి రంగులు వేసే విషయంలో తమ పట్ల అగ్రకులస్థులు వివక్ష చూపారంటూ దళితులు ఆందోళనకు దిగిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం జయపురం గ్రామంలో బుధవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి బాధిత దళితులు, పలువురు కేవీపీఎస్ జిల్లా నాయకులు తెలిపిన వివరాల ప్రకారం జయపురం గ్రామంలో ఈనెల 14న వేణు గోపాల స్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఆలయానికి రంగులు వేసేందుకు నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ పెయింటర్‌కు పనులు అప్పగించారు. దాంతో సదరు పెయింటర్ జయపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను కూలి పనికి పిలిచి రంగులు వేయించడం ప్రారంభించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు అగ్ర కులస్థులు అక్కడికి వచ్చి దళితులు ఆలయానికి రంగులు వేయడం అపచారమని, వారు ఈ ఆలయానికి రంగులు వేయొద్దంటూ అల్టిమేటం జారీ చేసి పనులు అడ్డుకున్నట్టు తెలిపారు. దీంతో రంగులు వేసే పనికి వచ్చిన వారితో పాటు మరికొందరు దళిత యువకులు ఆలయం వద్దకు చేరుకుని బైఠాయించి నిరసన తెలిపారు. దళితుల పట్ల అగ్ర కులస్థులు వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. అనంతరం తహసీల్దార్ కార్యలయం వద్దకు చేరుకుని దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేసి తహసీల్దార్ సీహెచ్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసిన దళిత సంఘాల నాయకులు కుల వివక్షను ప్రోత్సహిస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.


వేణుగోపాల స్వామి ఆలయం వద్ద బైఠాయించిన దళితులు

మట్టిని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

గణపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భూపాలపల్లి జిల్లా గణపురరం ఎస్సై అశోక్ తెలిపారు. ఇరిగేషన్ ఏఈ సమ్మారావు ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. థౌజండ్ క్వార్టర్స్ శివారులోని కర్నాలకుంట చెరువులో పలువురు కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. పలుమార్లు వారించినా యథేచ్ఛగా ఈ దందాను కొనసాగిస్తున్నారు. మంగళవారం రాత్రి మట్టి తరలిస్తుండగా వారిని ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. దీనిపై ఏఈ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయగా పాముకుంట్ల సమ్మయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా చెరువు నుంచి మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ సమ్మారావు ఈ సందర్భంగా హెచ్చరించారు.

కాంగ్రెస్ పాలనలోనే బీసీలకు న్యాయం

- బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవియాదవ్
- 42 శాతం రిజర్వేషన్ ప్రకటనతో సంబురాలు


నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పాలనలోనే బీసీలకు న్యాయం జరిగిందని, ఇచ్చిన మాటమేరకు కులగణనను పూర్తిచేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ ప్రకటన నేపథ్యంలో ములుగులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, మిఠాయి పంచిపెట్టారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రవియాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ పెంపునకు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమన్నారు. ఇచ్చిన హామీకి కట్టుబడే పార్టీగా కాంగ్రెస్ మరోసారి నిరూపించుకుందని, మిగతా రాజకీయ పార్టీలు కూడా బీసీలకు రిజర్వేషన్ పెంచుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

బీసీలంతా కాంగ్రెస్ వెంటే ఉంటారని, వచ్చే అన్ని ఎన్నికల్లోనూ బీసీల ప్రాతినిధ్యం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు మల్లాడి రాంరెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, ములుగు బ్లాక్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, మహిళా విభాగం అధ్యక్షురాలు రేగ కల్యాణి, పార్టీ ములుగు మండల అధ్యక్షుడు ఎమ్డీ చాంద్‌పాషా, గోవిందరావుపేట అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భార్య తనతో బైక్‌పై రాలేదని భర్త ఆత్మహత్య


సురేశ్ (ఫైల్)

వారం క్రితం క్రిమిసంహారక మందు తాగి.. చికిత్స పొందుతూ మృతి

ఇనుగుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పండుగకు హాజరై తిరుగు ప్రయాణంలో భార్య తన బైక్‌పై రాకుండా ఆటోలో వెళ్లడంతో మనస్థాపం చెంది క్రిమిసంహారక మందు తాగి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇనుగుర్తి మండలం కోమటిపల్లి శివారు మూలస్తంభం తండాలో చోటు చేసుకుంది. కేసముద్రం ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ సురేష్(35) తన భార్య స్వరూపను తీసుకొని గత నెల 28న ఇంటికన్నెలోని స్వరూప సోదరి ఇంట్లో దుర్గమ్మ పండుగకు వెళ్లారు. పండుగ ముగిసిన అనంతరం తిరుగు ప్రయాణంలో సాయంత్రం సురేష్ తన బైక్ ఎక్కాలని భార్య స్వరూపను కోరాడు. దీనికి స్వరూప నిరాకరించి బంధువులందరి ముందే ఆటో ఎక్కి బయలు దేరింది. దీంతో మనస్థాపం చెందిన సురేష్ తన ఇంటికి వచ్చి రాత్రి క్రిమిసంహారక మందు తాగాడు. అదే రోజు మహబూబాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి అక్కడి నుంచి మంగళవారం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. సురేష్ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. బుధవారం సురేష్ తల్లి గామ్నీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలకు ఎందుకు వెళ్లలేదన్నందుకు..


బద్రీనాథ్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ.. విద్యార్థి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం దరాతండా శివారు రేగడిగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రేగడిగూడెంకు చెందిన కారం అర్జున్-లక్ష్మి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి కుమారుడు బద్రీనాథ్(13), కుమార్తె సంతానం. బద్రీనాథ్ ఈదులపూసపల్లి జడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 1న స్కూల్‌కు వెళ్లకుండా ఎందుకు ఇంటివద్ద ఉన్నావని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన బద్రీనాథ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. ఇది గమనించిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బద్రీనాథ్ మృతి చెందాడు. తండ్రి అర్జున్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లి వైద్యానికి అప్పు దొరకలేదని..


బాలకిషన్ (ఫైల్)

కురవి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలం తులిస్యతండాకు చెందిన బానోత్ బాలకిషన్ (36) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలకిషన్ తల్లి జాను కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆమెను రెండ్రోజుల క్రితం ఆస్పత్రిలో చేర్పించారు. నగదు కోసం పలువురిని అడిగిన బాలకిషన్ తల్లి అస్పత్రి ఖర్చుల కోసం డబ్బులు ఎక్కడ లభించకపోవడంతో మనోవేదనకు గురై బుధవారం ఉదయం పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా అస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. బాలకిషన్ మృతి చెందాడు. మృతుడికి భార్య జాను, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి


మృతి చెందిన లిఖిత

నెల్లికుదురు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నీటి సంపులో పడి బాలిక మృతి చెందిన సంఘటన మానుకోట జిల్లా నెల్లికుదురు మండలంలోని మదనతుర్తి శివారు ఈక్యా తండాలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గుగులోత్ మౌనిక మోతీలాల్ దంపతుల కూతురు లిఖిత (2) తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటి తిరిగి వచ్చారు. అనంతరం ఇంటి పనులు చేసుకుంటున్నారు. లిఖిత ఇంటి ముందు ఆడుకుంటూ ఉంది. ఈ క్రమంలో బాలిక ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడి మృతి చెందింది. అనంతరం బాలిక ఇంటి ముందు కనిపించడకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల ఇండ్లలో వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో ఇంటి ఎదుట నీటి సంపులో చూడగా బాలిక మృతి చెంది నీటిపై తేలి కనిపించిందని తండావాసులు తెలిపారు. చిన్నారి తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2310	2100
పల్లికాయ (సూక)	6280	4600
పల్లికాయ (పచ్చిది)	4000	3100
కందులు	6752	5540
పెసళ్లు	6685	5133
పత్తి	6980	5800
ఎల్లో మిర్చి	16500	13500
పసుపు (కాడి)	-	-
తేజ మిర్చి	13700	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	14500	11500
యూఎస్ 341	14200	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ప్రైవేటు ఆస్పత్రిలో బాలుడి మృతి

డాక్టర్ నిర్లక్ష్యం వల్లేనని బంధువుల ఆరోపణ

తొర్రూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో డాక్టర్ నిర్లక్ష్యంతో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన ప్రకారం మండలంలోని కంటాయపాలెం గ్రామానికి చెందిన దాసరోజు వేణుగోపాల్ నాగమణిలకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు సిద్దార్థ(16) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజులుగా దగ్గు, జ్వరం రావడంతో తల్లి నాగమణి తొర్రూరులోని బాలాజి నర్సింగ్‌హోమ్‌కు తీసుకువచ్చారు. డాక్టర్ వికాస్ పరీక్షించి రక్త, మూత్ర పరీక్షలు చేయించి ఇంజక్షన్ తెప్పించి ఇవ్వడంతో బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లి కొద్ది క్షణాల్లో మృతి చెందాడు. కళ్ల ముందు కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బంధువులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. అప్పటివరకు తమతో మాట్లాడిన బాలుడు కళ్ల ముందే మృతి చెందడంతో వారు బోరున విలపించారు. పెద్దలకు వేసే ఇంజక్షన్ డోసు ఎక్కువ ఇవ్వడంతో శ్వాస ఆడక మృతి చెందాడని బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. డాక్టర్ తమ కుమారుడిని అకారణంగా చంపాడంటూ దాడికి దిగడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆస్పత్రి ఎదుట బంధువులు బైటాయించారు. సిద్దార్థ తండ్రి గత నాలుగు సంవత్సరాల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందగా తల్లి నాగమణి ఇద్దరు కుమారులను టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ చదివిస్తోంది. చేతికందిన కుమారుడు అకారణంగా మృతి చెందడంతో వారు విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై పరిస్థితిని సమీక్షించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై ఆస్పత్రి నిర్వాహకులను వివరణ కోరగా బాలుడికి గతంలో శ్వాసకు సంబంధించిన వైద్యం తీసుకుంటున్నట్లు సమాచారం. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న బంధువులు


మృతి చెందిన సిద్దార్థ



గతేడాది ఫిబ్రవరిలో జరిగిన మేడారం జాతరలో సమ్మక్క- సారలమ్మలను దర్శించుకుంటున్న భక్తులు

గద్దెల విస్తరణ లేనట్టేనా?

32 గుంటల స్థలంలోనే మేడారం గద్దెల సాలారం

- తల్లులను దర్శించుకునేందుకు ప్రతీ జాతరలో భక్తులకు ఇబ్బందులు
- 4 ఎకరాల్లో విస్తరించాలనే ప్రతిపాదన అటకెక్కిన వైనం
- 19ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించటంలో రెవెన్యూ జాప్యం
- ప్రపంచం అబ్బుర పడేలా జాతర నిర్వహిస్తామని దాటవేసిన గత ప్రభుత్వం
- ప్రశాంత దర్శనం కోసం కాంగ్రెస్ సర్కారైనా దృష్టిసారించాలని భక్తుల విజ్ఞప్తి

వరంగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన మహాజాతర మేడారం. ప్రతీ రెండేళ్లకొకసారి జరిగే జాతరకు కోటిన్నర మంది భక్తులు వస్తుంటారు. నాలుగు రోజుల్లో ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు తల్లుల దర్శనానికి రావటంతో తనవితీరా దర్శనం లభించటం లేదు. కేవలం 32గుంటల స్థలంలో నిర్మించిన సమ్మక్క- సారలమ్మల గద్దెల ప్రాంగణం (సాలారం) ఇరుకుగా ఉండటమే దీనికి కారణం. 2012లో ఈ ప్రాంగాణాన్ని పక్కనే ఉన్న దేవాదాయ శాఖకు చెందిన 4ఎకరాల భూమిలోకి విస్తరించాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చటం లేదు. గద్దెల ప్రాంగణం పక్కనే ఉన్న 19 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించటంలో రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా ప్రతీ జాతరకు ఇరుకు ప్రాంగణంలో తల్లుల దర్శనం దక్కటం లేదని భక్తులు ఆందోళన చెందుతున్నారు.

మహాజాతర స్థల విస్తరణకు విఫలయత్నాలు..

2018 ఫిబ్రవరిలో జరిగిన మహాజాతరకు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ జాతర జరిగే స్థలాన్ని 200 ఎకరాలకు విస్తరించడంతో పాటు రూ.200 కోట్ల నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించినప్పటికీ రూ.200 కోట్లు నిధులు రాలేదు. అయితే 2019లో అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి కొంత చొరవ చూపినప్పటికీ భూములు ఇచ్చేందుకు స్థానికులు ససేమేరా అన్నారు. మేడారం జాతర అభివృద్ధికి మొదటి విడతలో 62 ఎకరాల ప్రభుత్వ భూమి, 39 ఎకరాలు పట్టా భూమి కలిపి మొత్తం 101 ఎకరాలను లక్ష్యంగా పెట్టుకున్నారు. 62 ఎకరాల ప్రభుత్వ భూమి ఎక్కువగా రెడ్డిగూడెం, జంపన్నవాగు ఏరియాలో ఉంది. ఈ భూమిలో 58 మంది రైతులు కొన్ని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. వీరందరు భూమిని ప్రభుత్వానికి అప్పగించేందుకు ససేమేరా అన్నారు. ఇక 39 ఎకరాల పట్టా భూమిలో 32 మంది రైతులు ఉన్నారు. వీరిని కూడా వారి భూములను ప్రభుత్వానికి ఇచ్చేందుకు ముందుకు రాలేదు. దీంతో భూసేకరణకు బ్రేక్ పడింది. కనీసం ఆ నిధులతో మేడారం ప్రాంగణం విస్తరించేందుకు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఇరుకైన సాలారంలో తల్లుల గద్దెలు

పెద్ద ఎత్తున తమ ఇలువేల్పులను దర్శించుకునేందుకు వస్తున్న భక్తులకు తల్లుల దర్శన భాగ్యం కష్టమవుతుంది. గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడితే ఏ తెల్లవారు జామునో.. అర్ధరాత్రినో.. తల్లుల దర్శన భాగ్యం లభించదు. గంటల తరబడి తల్లుల దర్శన భాగ్యం కోసం భక్తులు క్యూ కడితే ఐదారు నిమిషాలు కూడా తల్లులను మనసార మొక్కుకునే అవకాశం కలగటం లేదని భక్తులు వాపోతున్నారు. దీనికి ప్రధానం కారణం లక్షల సంఖ్యలో క్యూలో ఉన్న భక్తులైతే.. చాలా ఇరుకుగా ఉన్న గద్దెల ప్రాంగణం (సాలారం)మరో కారణంగా చెప్పుతున్నారు. సుమారుగా 32 గుంటల స్థలంలోనే తల్లుల గద్దెల ప్రాంగణం ఉంది. సమ్మక్క, సాలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజుల కొలువై ఉండే ఈ ప్రాంగణం ఇరుకుగా ఉండటంతో భక్తులకు ప్రతీ జాతరకు ఇబ్బందికరంగా మారుతుంది. గద్దెల వద్ద ఐదారు వేల మంది భక్తులకంటే ఎక్కువ మంది భక్తులు నిలబడి మొక్కులు చెల్లించే పరిస్థితి లేదు. కనీసం దూరం నుంచి క్యూ లైన్‌లో నిలబడి మొక్కుకుందామన్న చుట్టు గోడలే అడ్డుగా ఉండటంతో అదికూడా సాధ్య పడటం లేదు. గంటల తరబడి గద్దెల ప్రాంగణం బయటే ఎండ, చలి అనే తేడా లేకుండా క్యూలో ఉండాల్సి వస్తుంది. దీనికి తోడు జాతర సమయంలో ఈ ప్రాంగణంలోనే పదుల సంఖ్యలో హుండీలు, బెల్లం బుట్టలను తొలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ప్రాంగణం మొత్తం ఇరుకుగా మారుతుంది. ఈ నేపథ్యంలో మేడారం గద్దెల వద్ద ఉన్న సాలారం స్థలాన్ని విస్తరించాలని గత దశాబ్దం కాలంగా భక్తులు డిమాండ్ చేస్తున్నారు. దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గద్దెల ప్రాంగణం విస్తరణకు నోచుకోవటం లేదు. దీంతో ప్రతి మహాజాతరకు తల్లుల దర్శన బాధలు తప్పెట్టు లేదని ఆందోళన భక్తుల్లో వ్యక్తం అవుతుంది.

దేవాదాయ భూముల్లో విస్తరిస్తేనే...

మహాజాతరను సక్సెస్ చేసేందుకు అధికారులు ఏర్పాట్లపై దృష్టిసారించారు. దేవాదాయశాఖ మంత్రి కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కొండా సురేఖనే ఉన్నారు. అయినప్పటికీ గిరిజన జాతరలో తల్లుల గద్దెల విస్తరణలో దేవాదాయశాఖ ప్రత్యేకంగా దృష్టిసారించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం గద్దెలు ఉన్న సాలారం కేవలం 32 గుంటల్లోనే ఉంది. దీన్ని మరో రెండు, మూడు ఎకరాల్లో విస్తరించాలని భక్తులు కోరుతున్నారు. గద్దెల పక్కనే దేవాదాయశాఖకు సంబంధించిన సుమారుగా 4 ఎకరాల భూమి ఉంది. దేవాదాయశాఖకు ఉన్న భూమిలో రెండు, మూడు ఎకరాల వరకు గద్దెల ప్రాంగణం విస్తరిస్తే తల్లులను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సులభంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. నాలుగు వైపుల క్యూ లైన్లు ఏర్పాటు చేసి భక్తులకు తల్లుల దర్శనం కలిగే విధంగా కొత్తగా ప్రాంగణం నిర్మిస్తే బాగుంటుందని భక్తులు పేర్కొంటున్నారు.

19ఎకరాల ప్రభుత్వ భూమి సేకరణలో జాప్యం

మేడారం తల్లుల గద్దెల సమీపంలోనే మరో 19 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని సేకరించేందుకు స్వాధీనంలో ఉన్న రైతులను ఒప్పించటంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2019లోనే గద్దెల వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని సేకరించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించగా, రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. 2022 జాతరలో మరోసారి భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2023లో ములుగు జిల్లా కలెక్టర్ ఖాతాకు రూ.2.73కోట్ల నిధులను జమ చేశారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు 19ఎకరాల్లో ఉన్న రైతులతో సంప్రదింపులు జరపటం లేదనే ప్రచారం జరుగుతోంది. ఈ 19 ఎకరాలతో పాటు దేవాదాయశాఖకు చెందిన 4 ఎకరాలు కలిపి మొత్తం 24 ఎకరాల భూమిని సేకరించి గద్దెల ప్రాంగణంతో పాటు అతిధి గృహాలు నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. గిరిజనులు తమ ఆధీనంలో ఉన్న భూములను ఇచ్చేందుకు ససేమేరా అంటే.. కనీసం దేవాదాయ శాఖకు చెందిన నాలుగు ఎకరాల్లో గద్దెల విస్తరణ చేపట్టి తల్లుల దర్శనం భాగ్యం ప్రశాంతంగా కల్పించాలని భక్తులు కోరుతున్నారు. దేశనలుమూలల నుంచి వచ్చే భక్తులకు సమ్మక్క, సారలమ్మ తల్లుల దర్శనం ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వం దృష్టిపెట్టాలని భక్తులు కోరుతున్నారు. వచ్చే ఏడాది జరుగనున్న మహాజాతరకు ఇప్పటి నుంచే ఏర్పాట్లపై కసరత్తు చేయాలని భక్తులు కోరుతున్నారు.

మినీ జాతరకు అంకురార్పణ



ఎత్తు బంగారం (బెల్లం)తో గద్దెలకు వస్తున్న భక్తులు

- మేడారంలో ఘనంగా గుడిశుద్ధి పండుగ
- తల్లుల దర్శనానికి 40వేలమందికి పైగా భక్తుల రాక
- సందడిగా మారిన సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణం

తాడ్వాయి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మేడారం మినీజాతరకు అంకురార్పణ జరిగింది. ఈనెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగే చిన్నజాతరకు అంకురార్పణగా.. మేడారం, కన్నెపల్లి గ్రామాల్లోని సమ్మక్క- సారలమ్మ అంతర్గత గుడుల్లో శుద్ధి పండుగను పూజారులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా తెల్లవారుజామున నిద్రలేచి జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం పూజారులు మేడారంలో సమ్మక్క గుడి, కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ గుడిని శుద్ధి చేశారు. దేవతల ప్రతిమలు, పూజా సామగ్రి బయటకు తీసి శుభ్రపరిచారు. గుడిలోపల దేవతల పీఠాలను పూజారుల కుటుంబాల ఆడపడుచులు అలుకుపూతలు చేసి ముగ్గులతో అలంకరించారు. ఈ క్రమంలో పూజారులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి పూజాసామగ్రిని రహస్య పూజలకు సిద్ధం చేశారు. మినీ జాతర వేడుకలకు ముందు ఈ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. మరో ఆరు రోజుల్లో మేడారం మినీ జాతర ప్రారంభం కానుండగా.. మినీ జాతర ముగిసి.. తిరుగువారం పండుగ జరిగేరోజు వరకు నిష్టతో ఉపవాసాలు పాటిస్తూ గుడుల్లో రహస్య పూజలు చేసి మినీ జాతరను నిర్వహిస్తారు. అయితే ఈ బుధవారం జరిగిన గుడిశుద్ధి పండుగతో మినీజాతర వేడుకలకు అంకురార్పణగా భావిస్తారు.



జంపన్నవాగులోని బావుల్లో ఇసుక పూడిక తీస్తున్న కూలీలు



బయక్కపేటలో గుడిమెలుగు పండుగ చేస్తున్న చంద వంశీయులు

భారీగా తరల్చొన భక్తులు... ఎండ తీవ్రతకు ఇబ్బందులు

గుడిశుద్ధి పండుగతో బుధవారం మినీజాతరకు అంకురార్పణ జరగ్గా.. తల్లులను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం సుమారు 40వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఇక మేడారం వనదేవతలను ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క- సారలమ్మలకు ఆయన ఎత్తు బంగారం సమర్పించారు. తల్లుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అయితే వనదేవతలను దర్శించుకోవడానికి మేడారం తరలివచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత కారణంగా దేవస్థానం ప్రాంగణంలో బండలు కాలాయని పలువురు వాపోయారు. మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఎండ వేడికి ఇబ్బంది పడ్డారు. కొంతమంది గొడుగులు వాడటం కనిపించింది.

మినీజాతరకు చురుగ్గా ఏర్పాట్లు..

మేడారం మినీ జాతరకు తరలివచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జంపన్నవాగులోని స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో వాగులోని ఊటబావుల్లో ఇసుక పూడికతీత పనులను ప్రారంబించారు. మినీ జాతర సుమారు 40లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసిన అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు బావుల్లో పుడికతీసి ఆరు మోటార్ల ద్వారా ఎనిమిది బీవోటీలకు నీరు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే సమ్మక్క- సారలమ్మల గద్దెల పరిసరాల్లో పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయి. కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ గుడి ఆవరణలో కూడా ఈ పనులు ప్రారంభమయ్యాయి.

సమ్మక్క పుట్టింట గుడిమెలుగు పండుగ

సమ్మక్క దేవతను తమ ఆడబిడ్డగా భావించి చంద వంశీయులు తాడ్వాయి మండలంలోని బయక్కపేట గ్రామంలో ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మినీ జాతర నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఆ గ్రామంలో గుడిమెలుగు పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పురాతన కాలం నుంచి ఉన్న సమ్మక్క మందిరం పైకప్పును తొలగించి కొత్తగా నిర్మించారు. అంతేకాకుండా సమ్మక్క దేవతకు సంబంధించిన పూజా సామగ్రి, ప్రతిమలను శుభ్రం చేసి పూజా కార్యక్రమాలను ప్రారంబించారు. మహిళలు గుడిని అలుకుపూతలు చేసి రంగురంగుల ముగ్గులు వేశారు. డోలి వాయిద్యాల నడుమ చంద వంశీయులు గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అదేవిధంగా తిరుగువారం వరకు నియమ నిష్టలతో దేవతకు పూజలు చేస్తూ వచ్చే బుధవారం జాతర నిర్వహిస్తారు.




జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ఎదురు కోడి మొక్కుతున్న భక్తురాలు

పెద్దాస్పత్రిలో ఇష్టారాజ్యం

- ఆ అధికారి కనుసన్నల్లోనే పరిపాలన
- ఉద్యోగుల ఐటీలో భారీ వసూళ్లకు తెర
- ఉన్నతాధికారులకు సైతం కొరకరాని కొయ్య
- ఇబ్బందులు పడుతున్న వైద్యులు, ఉద్యోగులు



ప్రైవేట్ వ్యక్తులకు ఐటీ అప్పగింత

ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వందలాది మంది రెగ్యులర్ ఉద్యోగుల ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్‌కు సంబంధించిన వ్యవహారాలను ఎంజీఎం మినిస్టీరియల్ సిబ్బంది గతంలో చూసేవారు. కానీ ఈ అధికారి ఓ ప్రైవేట్ ఆడిటర్ దగ్గరికి వెళ్లండి.. అంటూ మొబైల్ నెంబరు ఇస్తూ పంపుతున్నట్లు వైద్యులు, నర్సింగ్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా ఆ ప్రైవేట్ ఆడిటర్ దగ్గరికి వెళ్లాక డబ్బులు డిమాండ్ చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాల్లోనే పేదల ఆస్పత్రిగా పేరున్న మహాత్మాగాంధీ స్మారక ఆస్పత్రి (ఎంజీఎం) పరిపాలనలో ఓ అధికారి తన హవా నడిపిస్తున్నాడు. పెద్దాస్పత్రిలో ఆయన ఏం అనుకుంటే అది చేయగలడు. ఎంత న్యాయబద్ధమైన పనైనా తన పరపతితో పక్కన పెట్టగలడు. అమ్యామ్యాలు సమర్పిస్తే ఏ పనైనా క్షణాల్లోనే జరిగిపోతుంది.

అమ్యామ్యాల కోసమే కొనుగోళ్లు

పేద రోగులకు అవసరమయ్యే మందుల కొనుగోలు విస్మరించి.. తమకు లాభం చేకూర్చే మందులను మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిత్యం ఉపయోగపడే డ్రగ్స్ ఎంజీఎంలో అందుబాటులో లేకపోవడం ఇందుకు నిలువెత్తు సాక్ష్యం. ఇక రోగ నిర్ధారణ పరీక్షల కోసం ఉపయోగపడే కెమికల్స్‌ను కూడా తెప్పించకపోవడంతో సీబీపీ లాంటి సామాన్య పరీక్షలు కూడా ప్రయివేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్ని రకాల కాంట్రాక్టులు, కొనుగోళ్లు ఆ అధికారి కనుసన్నల్లో జరగాల్సిందే మరీ. ఆ అధికారి అన్నీ తానై వ్యవహరిస్తుండటంపై ఎంజీఎం గత సూపరింటెండెంట్ తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుత సూపరింటెండెంట్ కూడా ఈ వ్యవహారంలో జంకుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆర్ఎంవోకు వేతనం చెల్లింపు

ఎంజీఎం ఆస్పత్రిలో ఫారిన్ సర్వీస్ విధానంపై పని చేస్తున్న డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవో కాల పరిమితి ముగిసింది. ఆయన మాతృ సంస్థ అయిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు వెళ్లాల్సి ఉంది. లేదంటే కొనసాగింపు ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేయాలి. ఈ రెండు జరగకుండానే అధికారికి కొన్ని నెలలుగా జీతాలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టు ఉద్యోగులకు కొనసాగింపు ఉత్తర్వులు ఉన్నప్పటికీ జీతాలు ఇవ్వడం లేదు. ఎంజీఎం ఆస్పత్రిలో అభ్యుదయ సొసైటీ ద్వారా 38 మందికి కొనసాగింపు ఉత్తర్వులు ఉన్నప్పటికీ జీతాలు చెల్లించకుండా సదరు పరిపాలన అధికారి వేధింపులకు గురిచేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాంట్రాక్టు ఉద్యోగులు వెళ్లి జీతాల గురించి ఆరాతీస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు కాంట్రాక్టు ఉద్యోగులు వాపోతున్నారు.

బయోమెట్రిక్ కవర్లు లేని దుస్థితి

పేదల ఆస్పత్రిలో చెత్త వేసేందుకు బయోమెట్రిక్ కవర్లు కూడా అందుబాటులో లేవని నాలుగో తరగతి సిబ్బంది వాపోతున్నారు. స్టేషనరీ టెండర్లను ఖరారు చేయకుండా దాటవేస్తూ ఎక్కువ రేట్‌తో స్టేషనరీ కొనుగోలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక చాలీచాలని జీతాలతో సేవలు అందిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ జీతాల చెల్లింపుల కోసం కూడా ఆయనకు ముడుపులు సమర్పించాల్సిన దుస్థితి ఏర్పడింది.

పదోన్నతులలోనూ అదే తంతు

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, కారుణ్య నియామకాల విషయంలో న్యాయం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఇదే విషయంపై టీఎన్‌జీవో నాయకులు కూడా ఇటీవల సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. అయినా అమ్యామ్యాలు ఇస్తేనే ఫైలు ముందుకు కదులుతుందని సదరు అధికారి తేల్చి చెప్పినట్లు సమాచారం.

ఉద్యోగాల ఎరతో వసూళ్లు

ఎంజీఎం ఆస్పత్రిలో ఉన్న ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సీటీ టెక్నీషియన్‌లతోపాటు కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను 300 సీఎస్‌లో ఉద్యోగాలు ఇస్తామంటూ భారీ ఎత్తున వసూలు చేసినట్లు తెలిసింది.

ఆకాశాన్నంటుతున్న పసిడి ధర



రూ.85,800కు చేరిన పది గ్రాముల బంగారం

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ బంగారం ధర ఆకాశాన్నంటుతోంది. వివాహాలు, శుభకార్యాలు ప్రారంభమవుతున్న వేళ పసిడి ధర పెరగడంతో సామాన్య ప్రజలు లబోదిబోమంటున్నారు. గతంలో తులం బంగారం రూ.50వేల నుంచి రూ.60వేల వరకు ఉన్న సమయంలో అడ్వాన్స్ ఇచ్చి నగలు కావాలని దుకాణాలలో ఆర్డర్లు ఇవ్వగా ఇపుడు తులానికి రూ.20 నుంచి రూ.25 వేల వరకు ధర పెరగడంతో వ్యాపారులు తల పట్టుకుంటున్నారు. బుధవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 85,800లకు చేరుకుంది. కిలో వెండి ధర రూ. 96,500లకు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 79,450 పలికింది. ఉగాది పండుగ తర్వాత తెలుగు నూతన సంవత్సరంలో అధిక సంఖ్యలో వివాహాలు ఉండడంతో అప్పటివరకు ధర రూ.లక్షకు చేరుకుంటుందని వ్యాపార వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆడపిల్లల పెళ్లిళ్లు చేయడం సామాన్యులకు తలకు మించిన భారం అవుతోంది.

పట్టు తప్పితే పరిస్థితేంటి?





కొందరు ఆటోవాలాలు పైసల కోసం బడి పిల్లల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. పరిమితికి మించి చిన్నారులను ఎక్కించి బడులకు తరలిస్తున్నారు. అందుకు ఇదిగో ఫొటోలే నిదర్శనం. ఓ ఆటోలో పిల్లలను ఒకరిమీద ఒకరిని కూర్చోబెట్టుకుని.. ఆటోకు రెండువైపులా బరువైన బ్యాగులు తగిలించి.. తీసుకెళుతున్న ఈ దృశ్యం హనుమకొండ బాలసముద్రం వద్ద కనిపించింది. ఆటోవాలాలు పైసల కోసం ఇలా నిబంధనలకు విరుద్ధంగా బడి పిల్లలను తరలిస్తున్న క్రమంలో ఏ చిన్నారి పట్టు తప్పినా.. ఏదైనా ప్రమాదం జరిగినా పరిస్థితేంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పిల్లలకు జరగరానిది జరిగితే ఆ తల్లిదండ్రుల బాధ ఎవరు తీరుస్తారన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి విషయాల్లో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ పోలీసులు ఇలాంటి వాటిని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తోంది.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

హమాలీ కార్మికులకు
బోనస్ డబ్బులు ఇవ్వాలి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులు దీపావళి బోనస్ డబ్బులు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారధిరెడ్డి అన్నారు. సదరు డిమాండ్‌తో మహబూ బాబాద్ వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ఓ దాల్ ఆయిల్ మిల్ ప్రధాన గేటు ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం హమాలీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌సారధిరెడ్డి మాట్లాడారు. ఈ సంవత్సరం కూడ మిల్లులకు సంబం ధించిన యాజమానులంతా దీపావళి బోనస్‌లు ఇవ్వగా ఈ మిల్లు యజమాని మాత్రం హమాలీ కార్మికులకు ఇవ్వక పోవడంతో ఆందోళనకు దిగామని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, ముత్యాలు, చెక్కల సోమయ్య , రాంమూర్తి, నర్సింహా, దేవేందర్, నారాయణ, పెరుగుకుమార్ పాల్గొన్నారు.

చింతలగట్టులో మండమెలిగె పండుగ

- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం చింతలగట్టు వట్టివాగు సమ్మక్క- సారలమ్మల జాతరలో బుధవారం మండమెలిగె పండుగ ఘనంగా నిర్వహించారు. మినీ జాతరకు సరిగ్గా వారం రోజుల ముందు ఆలయ పూజారులు ఈ పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలతో మండ మెలిగె పండుగతో పూజారులు ఈ జాతరను ప్రారంభించారు. బుధవారం వేకువజామునే పూజారులు ఆలయాలను శుద్ధి చేసి ముగ్గులు వేశారు. డోలువా యిద్యాల నడుమ చింతలగట్టు పరిసరాలలో పూజారులు, వడ్డెలు, జాతర కమిటీ నిర్వాహకులు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. బూరుగు కొమ్మలతో దిష్టితోరణాలు కట్టారు. వనదేవతల గద్దెల చెంత పూజారులు వన దేవతలకు నైవేద్యాలను సమర్పించారు. అటవీ నుంచి తెచ్చినపూలను సమ్మక్క-సారలమ్మల గద్దెలకు ఆలంకరించారు. అమ్మవార్లకు పూజా సామాగ్రి, వస్త్రాలు, పసుపు,కుంకుమ, వడిబియ్యంను సమర్పిం చారు. మహిళలు పుట్టమట్టితో దేవాలయంలో ఉన్న శక్తి పీఠానికి పుసుపు, కుంకుమ పెట్టి పూజలు నిర్వహించారు. అటవీ పొలిమేరల్లో నీళ్ల కుండలను ఆరగించారు. దుష్టశక్తులు రాకుండా ధ్వజస్థంభం ఏర్పాటు చేసి కోడి పిల్లను కట్టారు. ప్రధాన పూజారి దారం సిద్దు అమ్మవార్లకు నూతన వస్త్రాలను ఆలంకరించారు. గుడికి మామిడి ఆకుల తోరణాలు కట్టారు. పూజారులు గద్దెలపైకి చేరు కుని పూజలు నిర్వహించి మండ మెలిగె పండుగను ఘనంగా నిర్వహించారు. మండమెలిగే మొదలు జాతర పూర్తయ్యే వరకు పూజారులు ఉపవాసాలు ఉండనున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, డిప్యూటీ తహసీల్దార్ కోమల, పూజారుల కమిటీ అధ్యక్షులు దారం సిద్దు, జాతర కమిటీ అధ్యక్షులు పెనక నాగయ్య, జాతర నిర్వాహకులు, పూజారులు కారం లక్ష్మయ్య, ఈసం సహదేవులు, వానం భద్రయ్య, ననుప వీరస్వామి, నరేష్, సుధాకర్, రమేష్, జనార్ధన్, కోటయ్య, వజ్జయ్య, సాంబరాజు, అశోక్, భద్రమ్మ, బుచ్చమ్మ పాల్గొన్నారు.



జాతర సమీపంలో నర్సంపేట- మానుకోట రహదారిపై నీళ్లు ఆరబోస్తున్న పూజారులు

ఎమ్మార్పీఎస్ మరిపెడ పట్టణ కమిటీ ఎన్నిక

మరిపెడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ మరిపెడ పట్టణ కమిటీని బుధవారం ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మరిపెడ మున్సిపల్ మాజీ వార్డు కౌన్సిలర్ ఎడెల్లి పరుశరాములు తెలిపారు. అధ్యక్షుడిగా వీరబాబు, ఉపాధ్యక్షులుగా రమేశ్, కార్యదర్శిగా సునీల్, సహాయ కార్యదర్శిగా సతీశ్, కోశాధికారిగా వెంకటేశ్, సహాయ కోశాధికారిగా విజయ్, ప్రచార కార్యదర్శిగా గణేశ్‌లను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ బాధ్యులు ఐనాల వెంకన్న, శాగంటి రమేశ్, ప్రవీణ్, రవీందర్, ఎడెల్లి సైదులు, కాటయ్య, రవికాంత్, లక్ష్మయ్య, శ్రీరాములు, శ్రీను, ఇద్దయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలి

కేసముద్రం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ కేసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఐ సౌజన్యకు బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు చొప్పరి శేఖర్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాసు సాయిచరణ్, మడత నారాయణ, నట్ల విజేందర్ పాల్గొన్నారు.

10న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) :జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 10న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా ఉంటుందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్. బాబు బుధవారం తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థినీ, అభ్యర్థులు ఈ అప్రెంటిస్ మేళాలో పాల్గొని శిక్షణ పొందిన తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించబడుతాయని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు www.apprenticeshipindia.org.inలో తమ వివరాల ను నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తు ఫారాలను తీసుకొని ఉదయం 10 గంటలకు అప్రెటింస్ మేళాకు హాజరు కావాలన్నారు. జిల్లాలోని ఐటిఐ పూర్తి చేసుకున్న అభ్యర్థినీ, అభ్యర్థులు వినియోగించుకోవాలన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని అడ్డుకోవడం ఆపాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిమందిరంలో ప్రతి గురువారం శ్రీ షిర్డి సాయి అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని దేవాలయ కమిటీ బాధ్యులు అడ్డుకోవాలనే నిర్ణయాన్ని నివారించాలని ట్రస్టు అధ్యక్షులు, స్థల దాత నారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్‌కు వినతిపత్రం అందజేశారు ట్రస్టు బాధ్యులు నీలం శ్రీనివాస్, ఎస్. కృష్ణమూర్తి, సిహెచ్.సత్యనారాయణ, మహేందర్, కృష్ణ పాల్గొన్నారు.

'సద్దిమూట'ను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో అమలు చేస్తున్న సద్దిమూట పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్‌చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్‌గోపాల్‌లోయలు కోరారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో రూ.5ల భోజనం అమలు తీరును వారు మార్కెట్ అధికారులు, కార్మిక సంఘాలు, రైతు సంఘాలతో కలిసి పరిశీలించారు. యార్డుకు వచ్చే రైతులకు ఆకలి తీర్చే ఈ పథకం ప్రవేశ పెట్టడం సంతోషంగా ఉందని చెప్పారు.

విద్యపై పూర్తి అవగాహన పెంచుకోవాలి

గార్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకొనే విద్యార్థినులు విద్యపై పూర్తి అవగాహన పెంచుకోని మేరుగైన ఫలితాలు సాధించాలని జీసీడీవో కె.విజయ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన అశ్రమ పాఠశాలలో పాఠ్యాంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ఉపాధ్యాయులు వారికి తగిన రీతిలో విద్యాబోధన చేస్తే వారి భవిష్యత్తు మారిపోతుందన్నారు. హెచ్‌ఎం. జోగయ్య, వార్డెన్ అజ్మీరా రాధిక, పీడీపద్మ, రుక్కి, హనుమంతు, వీరన్న గంగావత్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి హుస్సేన్‌నాయక్ విరాళం

కేసముద్రం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) :కేసముద్రం స్టేషన్ బ్రహ్మంగారి గుడితండాలో దుర్గమ్మ గుడి నిర్మాణానికి జాతీయ ఎస్టీకమీషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ రూ.25వేల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్, పొదిల నర్సింహారెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి నిర్మాణ కమిటీకి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో భూక్య రవి, పవన్, భోజ్యా, భీమా, బాలు, వెంకన్న పాల్గొన్నారు.

పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):మహబూబాబాద్ జిల్లాలోని నిరుద్యోగులైన యువతీ, యువకులు ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ పోటీ పరీక్షల 100 రోజుల ఉచిత శిక్షణకు ఈ నెల 9లోగా దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎంపివి.ప్రసాద్ బుధవారం తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక విధానం ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో సాధించిన మార్కులు, రిజర్వేషన్ ప్రాతి పాదికన ఉంటుందన్నారు. అర్హత గల అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 12 నుంచి 14 వరకు ఉంటుందన్నారు. 15వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. 0870-2571192, 040-24071178లను సంప్రదించాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



మరిపెడలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మరిపెడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డితోనే ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత, బీసీ రిజర్వేషన్ల పెంపు సాధ్యమైందని జిల్లా కాంగ్రెస్‌నేత వంటికొమ్ము యుగేంధర్‌రెడ్డి, మరిపెడ మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లీ రఘువీర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర శాసనసభ, శాసన మండలిలో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లపై, ఎస్సీ వర్గీకరణపై సభ తీర్మాణం చేయడాన్ని హర్షిస్తూ బుధవారం మరిపెడ గాంధీ సెంటర్లో స్థానిక కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకీ క్షీరాభిషేకం నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుగుకుమార్ అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కె. వీర బ్రహ్మాచారికి వినతి పత్రాన్ని అందించారు. వెలుగు శ్రావణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బాలికలు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పొదుగు నర్సయ్య

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బాలికలు తమ బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలంటే తమ బాల్యంలోనే చదువపట్ల శ్రద్ధ చూపాలని మహబూబాబాద్ బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం పొదుగు నర్సయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో బుధవారం వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదిరోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో అనిత, పర్యవేక్షకులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

తొర్రూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ విఫలమైందని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు బొల్లం అశోక్ అన్నారు. బుధవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం తొర్రూరు మండల అధ్యక్ష కార్యదర్శులను ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా నర్సింహ, కార్యదర్శిగా సుమంత్‌తో పాటు మరో 14 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

తొర్రూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధ మండలాల్లో సీఐ ప్రవీణ్ ఆదేశాల మేరకు ఎస్సై రవళి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నర్సింహులపేట మండలంలోని పడమటిగూడెం గ్యామ తండాలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 800కేజీల నల్ల బెల్లం, 100కేజీల పటిక, రెండు ద్విచక్ర వాహనాలు. ఒక కారును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎక్సైజ్ పోలీసులు హెచ్చరిం చారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పీఎం నరేంద్రమోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మరిపెడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్ పేదలు హర్షించే విధంగా ఉందని హర్షం వ్యక్తంచేస్తూ మరిపెడ బీజేపీ శ్రేణులు బుధవారం పీఎం నరేంద్రమోదీ ఫ్లెక్సీకి స్థానిక ఆర్‌అండ్‌బీ సెంటర్‌లో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మరిపెడ మండల బాధ్యులు కట్టోజు గంగాధర్, భాస్కర్, రమేశ్, రాములు, సాయి, శ్రీనివాస్, ఆకుల హరికృష్ణ, సురేశ్, సతీశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నెల్లికుదురు,ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : ఐక్యతగా ఉండే దళితులను విడగొట్టే విధంగా వర్గీకరణ బిల్లులను ఉభయ సభల్లో ఆమోదించడాన్ని నిరసిస్తూ బుధవారం నెల్లికుదురు అంబేద్కర్ సెంటర్ వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చిట్టిమల్ల మహేష్, మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్ మాట్లాడారు. మాల మహానాడు జిల్లా కార్యదర్శి దాసరి యాకయ్య, చదల యాకాంతం, మద్దెల రమేష్, శ్రీకాంత్, నెల్లికుదురు గ్రామశాఖ అధ్యక్షుడు రజనీకుమార్, శ్రీరామగిరి గ్రామశాఖ అధ్యక్షుడు రాములు, ఆరె ఐలయ్య పాల్గొన్నారు.

రైతు కార్మిక ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, ప్రజా వ్యతిరేకమైనదని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల నేతలు చిన్న చంద్రన్న, నందగిరి వెంకటేశ్వర్లు, నల్లపు సుధాకర్, మేక వీరన్న, ననుప సోమయ్య, గుజ్జు దేవేందర్, సోమయ్య, కోటేష్, నాగన్న, వెంకన్న, సూర్యం, ఎస్‌కె.మదార్‌లు అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం మహబూబాబాద్ తహసీల్ కార్యాలయం ఎదుట రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. తాజ్‌పాషా, వీరన్న, రాజన్న, యాకయ్య పాల్గొన్నారు.

●డోర్నకల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణానికి దారి తీస్తుందని సీపీఎం జిల్లా నాయకులు శెట్టి వెంకన్న అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపులు లేవని, ఇది జాతీయ సమగ్రతను దెబ్బతీసే బడ్జెట్ అని ఆయన విమర్శించారు. బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రతులను డోర్నకల్ గాంధీసెంటర్‌లో బుధవారం దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు ఉప్పునపల్లి శ్రీనివాస్, బొమ్మన అశోక్‌కుమార్, బొబ్బ వెంకట్‌రెడ్డి, దాసరి మల్లేశం, పెంటిక వెంకట్రాములు, ఎండి.నవాబ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రతిపక్షాల రాద్ధాంతం తగదు

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజాధారణ పొందిన ప్రభుత్వంపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం మానుకోవాలని కాంగ్రెస్‌మండల అధ్యక్షులు చిట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గూడూరు మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షులు బొల్లికొండ మధు, రాసమల్ల యాకయ్య, రసూల్, లక్ష్మినారాయణ, రవిసింగ్, మంగీలాల్, బాలునాయక్, శ్రీను, వెంకట్‌రెడ్డి, సూరయ్య, వెంకన్న, సమ్మయ్య, వినయ్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో పెరిగిన కూలీ రేట్లు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్‌లో రైతుల సరుకులు బస్తాల్లోకి నింపేందుకు ఒక్కొక్క బస్తాకు రూ.12 చొప్పునపెంచడానికి మార్కెట్ చైర్మన్, వ్యాపార వర్గాలు, కార్మిక రైతు సంఘాల మధ్య ఒప్పందం కుదిరింది. రూ.12 పెంచినందుకు రైతుల నుంచి దానం పేరుతో ఎలాం టి గింజలు తీసుకోవద్దని నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్‌లో బుధవారం మార్కెట్ చైర్మన్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్‌గో పాల్‌లోయతో వ్యాపారవర్గ ప్రతినిధులు గోపాల్‌ఝువర్, జగదీష్, దామోదర్, కిశోర్, నర్సింహారావు,యాకాంబ్రం కార్మిక సంఘ, రైతు సంఘాలప్రతినిధులు కుమ్మరికుంట్ల నాగన్న, నల్లపు సుధాకర్, కంచె వెంకన్న, దడువాయి సంఘం ప్రతినిధులు చర్చలు జనరిపారు. గతంలో రూ.5.80లు ఉండగా ప్రస్తుతం రూ.12లకు పెంచారు. గురువారం నుంచి పెంచిన రేట్లు అమల్లోకి వస్తాయి.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



కేటీఆర్‌తో ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ కవిత

మహబూబాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శాసనమండలిలో బీఆర్ఎస్ పార్టీ విప్‌గా నియామకమైన ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి పూల మొక్కను అందించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో శాసనమండలి విప్ పదవిని కట్టబెట్టారని తాను మరింత బాధ్యతగా పని చేస్తానని ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మానుకోట జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత, నాయకులు మన్యుప్యాట్నీ, బోడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దాడులను నిరసిస్తూ న్యాయవాదుల ధర్నా

తొర్రూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై పోలీసుల దాడులను నిరసిస్తూ బుధవారం తొర్రూరు మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట న్యాయవాదులు విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సెక్రెటరీ గణపురం రామకృష్ణ మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న న్యాయవాదులపై నిత్యం జరుగుతున్న దాడులు అమానవీయమని అన్నారు. న్యాయవాది గందం శివపై వరంగల్‌లో ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి వారి సిబ్బంది దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. న్యాయవాదులపై దాడులు ఉపేక్షించేది లేదని, న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

గార్ల ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మామిడి రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక లాభాలు పొందాలని వ్యవశాయశాఖ ప్రిన్సిపల్ సైంటిస్టు డా కిరణ్ సూచించారు. బుధవారం మండలంలోని సీతంపేట గ్రామంలో మామిడి పెంపకంపై రైతులుకు అవగాహన సదస్సును నిర్వహించారు. మామిడి పెంపకంలో చీడ పీడల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులను కోరారు. రైతులు అడిగిన పలు సందేహాలకు శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఈక్యాక్రమంలో కెవికె మల్యాల కో ఆర్డినేటర్ డాక్టర్ మాలతి, జిల్లా ఉద్యాన అధికారి మరియన్న, హార్టికల్చర్ సైంటిస్టు రాంబాబు, మండల ఏఈవో కావటి రామారావు పలువురు మామిడి రైతులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు

మరిపెడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో కరెంట్ ఎద్దడి రాకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ నరేశ్ పేర్కొన్నారు. బుధవారం మరిపెడలోని భార్గవ్ ఫంక్షన్‌హాల్‌లో సబ్ డివిజన్ స్థాయి విద్యుత్ వినియోగదారుల సదస్సు స్థానిక ట్రాన్స్‌కో అధికారులు నిర్వహించగా ఎస్ఈ నరేశ్ పాల్గొని మాట్లాడారు. డీఈఈ మధుసూదన్, ఏడీఏ అజయ్, ఏఈలు పావనీ, నవ్య, లైన్‌ఇన్స్‌పెక్టర్లు, లైన్‌మెన్‌లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మరిపెడ మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లీ రఘువీర్‌రెడ్డి, అఫ్జల్, పట్టణ అధ్యక్షుడు తాజ్‌ద్దీన్, అఫ్సర్ పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల వద్ద అప్రమత్తంగా ఉండాలి

ఇనుగుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయ మోటార్లు, స్టార్టర్ల వద్ద అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని మహబూబాబాద్ విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ పెరుమళ్లపల్లి విజయ్‌కుమార్ సూచించారు. ఇనుగుర్తి మండల కేంద్రంలో బుధవారం రైతు సుంకరి శివ వ్యవసాయ క్షేత్రంలో 'విద్యుత్‌శాఖ రైతు పొలంబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు విద్యుత్ ఏడీ ప్రశాంత్, ఏఈ కె.రాజు, లైన్‌మెన్ మలిశెట్టి యశ్వంత్, దేవులపల్లి యాకన్న, మాలోత్ రమేష్, శంకర్, రైతులు పాల్గొన్నారు.



రైతు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డీఈ

జాతరలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



జాతరపై అధికారులతో సమీక్ష జరుపుతున్న ఆర్డీవో కృష్ణవేణి

కురవి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) :మహాశివరాత్రి సందర్భంగా జరిగే కురవి జాతరలో భక్తులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని ఆర్డీవో కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో బుధవారం కురవి జాతరపై సమీక్ష సమావే శాన్ని నిర్వహిం చారు. వీరభద్రస్వామి జాతర కోసం ఆలయంలో ఏర్పాట్ల పర్యవేక్షణ, నీటి వసతి, విద్యుత్ సరఫరా, పారిశుద్యం, శాంతిభద్రతలు, రవాణా సౌకర్యం, వైద్య, ఆరోగ్యశాఖ, రహదారులు, అగ్నిమాపక శాఖలతో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖలు పూర్తిస్థాయిలో సహకరించి జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమీక్షలో ఆలయ ఈవో సత్యనారాయణ, దేవాలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు డొంగల జనార్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, చిన్నం గణేష్, సోమ్లు, సక్రునాయక్, బిక్షపతి, బాలగాని శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సాంస్కృతిక సేన అధ్యక్షుడిగా వెంకట్రావు



వెంకట్రావుకు నియామక పత్రాన్ని అందిస్తున్న భరత్‌చందర్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షుడిగా డోర్నకల్ మండలం ఉయ్యాలవాడకు చెందిన పగిడిపాల వెంకట్రావు ఎన్నికయ్యారు. మహబూ బాబాద్‌లో టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు ఆధ్వర్యంలో బుధవారం జిల్లా అధ్యక్షుడుగా వెంకట్రావును ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి చేతుల మీదుగా ఉయ్యాలవాడకు చెందిన వెంకట్రావుకు నియామక పత్రాన్ని అందిం చారు.

ఎస్సారెస్పీ జలాలు విడుదల చేయాలి

తొర్రూరురూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కర్కాల గ్రామానికి ఎస్సారెస్పీ జలాలు విడుదల చేయాలని గ్రామ రైతులు బుధవారం బయన్న వాగు వద్ద ఆందోళన చేపట్టారు. రైతులు సెగ్గెం లచ్చయ్య, ఎల్లమ్మ, మల్లయ్య మాట్లాడుతూ కర్కాల గ్రామంతో పాటు శివారు గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల పంట వరకు బయన్నవాగు ద్వారానే సాగు జరుగుతుందన్నారు. ప్రతీ సంవత్సరం ఎస్సారెస్పీ జలాలు రావడంతో వాగు పరివాహక రైతులు సాగుచేసేవారమన్నారు. అయితే ఎస్సారెస్పీ జలాలు వస్తాయనే ఉద్దేశ్యంతో రైతులు వరిసాగు చేశామని వెల్లడించారు. ప్రభుత్వం జలాలు విడుదల చేసి నెల రోజులు గడిచినా చుక్క నీరురాక పోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆందోళనలో కర్కాల గ్రామానికి చెందిన సుమారు వంద మంది పాల్గొన్నారు.

చింతపల్లిని కురవి మండలంలో చేర్చాలి

కురవి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సీరోలు మండలంలోని చింతపల్లిని తిరిగి కురవి మండలంలో చేర్చాలని మాజీ సర్పంచ్ జె.రంగన్నమాజీ ఎంపీటీసీ డొంగల నర్సయ్యమామిండ్ల వెంకన్న, హత్తిరాం, డి.వీరన్న, బానోత్ మంగీలాల్‌లు బుధవారం కలెక్టర్ కార్యాలయం, జడ్పీ సీఈవో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... కురవికి దగ్గరగాఉన్న చింతపల్లిని సీరోలులో చేర్చడం వల్ల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

చింతపల్లి, కొత్తూరు (సీ) గ్రామాలను కురవిలో కలపాలి

సీరోలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి, కొత్తూరు (సి) ఉమ్మడి గ్రామాలను కురవి మండలంలో కలపాలని చింతపల్లి గ్రామస్థులు జెర్రిపోతుల రంగన్నగౌడ్, మామిండ్ల వెంకన్న, డి. నర్సయ్య, డి. వీరన్నలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జడ్పీ సీఈవో పురుషోత్తంకు బుధవారం సదరు డిమాండ్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...చింతపల్లి, కొత్తూరు(సి) ఉమ్మడి గ్రామాలను ఇటీవల గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతనంగా ఏర్పడిన సీరోలు మండలంలో విలీనం చేశారని తెలిపారు. ఈ రెండు గ్రామాలు కురవి మండలానికి సమీపంలో జాతీయ రహదారి 365పై ఉన్న గ్రామాలను రవాణా సౌకర్యం, అధికార కార్యక్రమాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న సీరోలు మండలంలో కలపడం వలన ఇబ్బందిగా మారింది. చింతపల్లి గ్రామ ఎంపీటీసీని మార్చి సీరోలు ఎంపిటీసీగా మార్చారాన్నారు. ఇట్టి విషయంలో మా చింతపల్లి,పెదలాల్‌తండా, కొత్తూరు (సి) ఎంపీటీసీగా చేసి పాత కురవి మండలంలో యథావిధిగా కొనసాగించాలని కోరారు.

ఠాణాలో వరుస దొంగతనాలు?

●నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో రికవరీ సొత్తు మాయం

నర్సింహులపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో వరుస దొంగతనాలు కలకలం రేకెత్తిస్తున్నాయి. పలు కేసుల్లో రికవరీ చేసి నిల్వ చేసిన సొత్తు మాయమైన విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 1, 2న స్టేషన్ ఎస్‌హెచ్‌వో సొంత పని నిమిత్తం సెలవుపై వెళ్లారు. విషయం తెలుసుకున్న ఓ ప్రైవేటు వ్యక్తి గుట్టు చప్పుడు కాకుండా ఠాణాలోని పోలీస్ క్వార్టర్ గదిలో నిల్వ చేసిన నల్లబెల్లం బస్తా ఎత్తుకెళ్తున్నాడు. ఈ క్రమంలో డ్యూటీలో ఉన్న ద్వితీయ స్థాయి పోలీసు అధికారి సదరు వ్యక్తిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని విచారణ చేయగా పోలీసు స్టేషన్‌లోని ఓ కానిస్టేబుల్‌కు బంధువునని, ఆయన చెప్పితేనే ఈ పని చేసినట్లు చెప్పి వెళ్లినట్లు సమాచారం. సెలవులను ముగించుకొని విధుల్లో చేరిన అధికారికి జరిగిన విషయం చేరవేయడంతో విచారణ ప్రారంభించినట్లు సమాచారం. నర్సింహులపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసి స్వాధీనం చేసుకున్న 6 బస్తాల నల్లబెల్లం, 100 మీటర్ల విద్యుత్ సర్వీస్ వైరు, రైతుల వ్యవసాయ బావులకు సంబంధించిన మోటారు స్టాటర్లు, పలు వాహనాల బ్యాటరీలు, పురుగు మందు పిచికారి చేసే 2 థైవాన్ పంపులు మాయం చేసినట్లు అధికారి విచారణలో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. కంచె చేనును మేసినట్లు ప్రజా సొత్తుకు రక్షణ కల్పించాల్సిన అధికారులే భక్షిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సంబంధిత ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వెచి చూడాల్సిందే. ఈ ఘటనపై ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా సొంత పని నిమిత్తం సెలవుల్లో వెళ్లానని, నల్లబెల్లం, ఇతర సామగ్రిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.



నర్సింహులపేట పోలీస్‌స్టేషన్